ఉప్పుమిల్లిలో ఏడు కుటుంబాలు వెలి

టీడీపీకి ఓటు వేశారనే నెపంతో ఎవరైనా వారితో మాట్లాడితే రూ.5 వేలు జరిమానా

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

గ్రామ పెద్దలతో చర్చించిన అధికారుల బృందం

- వార్త మెయిన్‌లో

మత్స్యకార భరోసా రెట్టింపుపై వనమాడి హర్షం

కాకినాడ సిటీ/ కలెక్టరేట్(కాకినాడ), జనవరి 2(ఆంధ్రజ్యోతి): వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే మత్స్యకార భరోసా రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచడం వల్ల కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారులను అన్ని విధాలుగా మోసం చేసిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. కాకినాడ జిల్లాలో 21,129 లబ్ధిదారులకు, అమలాపురం జిల్లాలో 11,305 లబ్ధిదారులకు రూ.64 కోట్ల 86 లక్షల 80 వేల రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. అలాగే ఓఎన్జీసీ నష్టపరిహార నిధులను కూడా లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

అర్ధరాత్రి డివైడర్‌ను ఢీకొని ఇద్దరు యువకుల మృతి

- ఇద్దరూ వరుసకు అన్నదమ్ములు.. వీరిది మోరంపూడి
- గండేపల్లి మండలం మురారి వద్ద ఘటన

సముద్రంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

- మూడుకు చేరిన మృతుల సంఖ్య
- కన్నీరుమున్నీరుగా విలపించిన నానమ్మ

7



మురిపించేను!

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఒకపక్క సంక్షేమం.. మరో పక్క అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గురువారం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చుతూ కేబినెట్‌లో అన్నదాత సుఖీభవ, మత్స్యకారులకు వేట నిషేధం పరిహారం పెంపు ఆదేశాలు జారీ చేసింది.గత వైసీపీ ప్రభుత్వం అరకొరగా ఇచ్చిన ఆర్థిక లబ్ధిని దాదాపు రెట్టింపుచేస్తూ నిర్ణయాలు తీసుకుంది.తద్వారా అన్నదాతలు, మత్స్యకారుల్లో ఆనందం నింపింది. అదే సమయంలో ఐదేళ్ల పాటు పెట్టుబడుల ఊసే లేకుండా అభివృద్ధిలో వెనుకబడిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను పారిశ్రామికంగా పరుగులు తీసేలా కీలక ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. గ్రీన్‌అమ్మోనియా, ఎలక్ట్రోలైజర్ ఉత్పత్తి యూనిట్ల ద్వారా ఏర్పాటు చేయనున్న కంపెనీలు పలు దశల్లో పెట్టనున్న రూ.16 వేల కోట్ల పెట్టుబడులకు ప్రోత్సాహకాలు ప్రకటించింది.



అన్నదాతా సుఖీభవ..

అన్నదాతలకు కేంద్రసాయంతో కలిపి అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇస్తున్నట్టు ప్రకటించింది. సూపర్‌సిక్స్ హామీ నేపథ్యంలో ఇచ్చిన మాట నెరవేరుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 4.54 లక్షల మంది అన్నదాతలకు రూ.908 కోట్ల వరకు లబ్ధి చేకూరనుంది. ప్రధానంగా కాకినాడ జిల్లాలో 1.86 లక్షల మంది రైతులకు రూ.370 కోట్లు దక్కనుంది. తూర్పుగోదావరి జిల్లాలో 1.21 లక్షలు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1.65 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో అన్నదాతలకు ఎకరాకు కేవలం రూ.13,500 వేలు మాత్రమే అందేది.

పిఠాపురం 'పాడా'కు 19 పోస్టులు

మరోపక్క పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి 19 కొత్త పోస్టులను మంజూరు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

ఆనందం రెట్టింపు...

సుదీర్ఘ సముద్రతీరం ఉన్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో వేలల్లో మత్స్యకారులు ఉన్నారు. వీరందరికి సముద్రంలో చేపలవేటే జీవనాధారం. ఏటా ఏప్రిల్ నుంచి జూన్ మధ్య దాదాపు 61 రోజుల పాటు వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అసలు ఉపాధి ఉండదు. దీంతో ప్రభుత్వాలు వేట నిషేధ సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయి. గత వైసీపీ హయాంలో మత్స్యకార భరోసా కింద వేట నిషేధ పరిహారం మత్స్యకారులకు రూ.10 వేలు చెల్లించేది. కూటమి ప్రభుత్వం రాగానే మత్స్యకారులకు అందించే పరిహారం పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వేట నిషేధ పరిహారాన్ని ఏకంగా రూ.20 వేలు చేస్తున్నట్టు ప్రకటించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన పరిహారాన్ని రెట్టింపు చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 32,434 మంది మత్స్యకారులకు రూ.64.86 కోట్ల లబ్ధి జరగనుంది. కాకినాడ జిల్లాలో 21,129 మంది, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 11,305 మంది మత్స్యకారులకు పరిహారం అందనుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లోకి నిధులు జమకానున్నాయి. దీంతో మత్స్యకారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

కూటమి వరాల హారం.. ఆనంద తీరం

- రాష్ట్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలు
- మత్స్యకారుల పరిహారం రెట్టింపు
- రూ.20 వేలకు పెంచుతూ నిర్ణయం
- 32,434 మందికి లబ్ధి
- అన్నదాత సుఖీభవ రూ.20 వేలు
- జిల్లాలో 4.54 లక్షల మంది రైతులు
- కాకినాడకు రెండు పరిశ్రమలు
- రూ.16 వేల కోట్ల పెట్టుబడులు

అమ్మోనియా హబ్‌గా కాకినాడ..

వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకినాడకు ఒక్కటంటే ఒక్క పరిశ్రమా రాలేదు. పైగా ఉన్న పరిశ్రమలను బెదిరించి ఏకంగా రాయించేసుకున్నారు. దీనికి కాకినాడ సీపోర్ట్‌లో వాటాల మార్పే నిదర్శనం. అయితే వైసీపీ మిగిల్చిన విధ్వంసం నుంచి బయటపడి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా పరిశ్రమలను ఆహ్వానిస్తూ కంపెనీలకు పెద్దపీట వేస్తోంది. కాకినాడలో ఏర్పాటవుతున్న గ్రీన్ అమ్మోనియా, ఎలక్ట్రోలైజర్ కంపెనీలకు భారీగా అండగా నిలబడి ప్రోత్సాహకాలు ప్రకటించింది. హైదరాబాద్‌కు చెందిన గ్రీన్‌కో కంపెనీ కాకినాడలో రూ.13 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. కంపెనీని ప్రోత్సహించి భారీగా ఉద్యోగ, ఉపాధి కల్పన జరిగేలా కోట్లలో స్టాంప్ డ్యూటీ మినహాయింపునిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఒకరకంగా ఈ కంపెనీ కార్యకలాపాలు ప్రారంభిస్తే కాకినాడ రూపురేఖలు మారడంతోపాటు రాష్ట్ర ఖజానాకు భారీగా పన్నుల ఆదాయం సమకూరనుంది. చలమలశెట్టి సునీల్ సోదరుడికి చెందిన గ్రీన్ కో కంపెనీ ఏఎం గ్రీన్‌గా ఏర్పడి 2023లో కాకినాడలో పేరొందిన నాగార్జున ఫెర్టిలైజర్ కర్మాగారాన్ని రూ.1,700 కోట్లకు స్టాక్ ఎక్స్ఛేంజీ ద్వారా కొనుగోలు చేసింది. ఇప్పుడు దీనినే సాంకేతికంగా అభివృద్ధి చేసి గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయబోతోంది. 2026 జూన్‌లోపు ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసి ఒక మిలియన్ టన్ను సామర్థ్యంతో కూడిన గ్రీన్ అమ్మోనియాను కంపెనీ ఉత్పత్తి చేయనుందని అంచనా వేస్తున్నారు.

నీటి నుంచి ఆ రెండూ..

కాకినాడలో రూ.2,800 కోట్లతో ఎలక్ట్రోలైజర్ల తయారీ ప్లాంట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. హైడ్రోజన్ ఇంధనం తయారీలో కాకినాడ దేశంలోనే కీలకంగా మారనుంది. ఈ ప్లాంట్‌ను సైతం గ్రీన్‌కో కంపెనీ ఏర్పాటు చేయబోతోంది. ఈ ప్లాంట్ ద్వారా ఏటా 2 గిగా వాట్‌ల ఉత్పత్తి చేయనున్నారు. ఈ కంపెనీ నీటిలో ఎలక్ట్రోలైజర్ యంత్రాలను ప్రవేశపెట్టి నీటి నుంచి హైడ్రోజన్, ఆక్సిజన్‌ను వేరుచేస్తుంది. ఇందులో హైడ్రోజన్‌ను కాకినాడలో ఏర్పాటుచేయనున్న గ్రీన్ అమ్మోనియం ప్లాంట్‌కు ఇంధనంగా వినియోగించనుంది. హైడ్రోజన్‌లో నైట్రోజన్‌ను కలిపి గ్రీన్ అమ్మోనియం తయారుచేయనుంది. నీటి నుంచి వేరుచేసిన ఆక్సిజన్‌ను సైతం విక్రయించనుంది.







ఉత్తరకంచిలో వేసిన సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్.. ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రిలో బాలింతతో మాట్లాడుతున్న కలెక్టర్

రోడ్ల పనులు సకాలంలో చేపట్టాలి

- కలెక్టర్ షాన్‌మోహన్
- మూడు గ్రామాల్లో పర్యటన.. సమస్యల పరిశీలన

ప్రత్తిపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మంజూరైన రోడ్ల పనులు వెంటనే మొదలుపెట్టి సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ షాన్ మోహన్ షగిలి అధికారులను ఆదేశించారు. ప్రత్తిపాడు మండలంలోని ప్రత్తిపాడు, వేములపాలెం, పెద్దిపాలెం, ఉత్తరకంచి గ్రామాల్లో గురువారం కలెక్టర్ పర్యటించారు. వేములపాలెం, ఉత్తరకంచి, పెద్దిపాలెంలలో రోడ్ల పరిస్థితిని పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రోడ్ల నిర్మాణ పనులు త్వరలోనే పూర్తిచేయాలన్నారు. వేములపాలెంలో శిథిల పాఠశాల భవనాన్ని సందర్శించి నూతన పాఠశాల భవనానికి అవసరమైన స్థలాన్ని గ్రామస్తులు సూచించడంతో కలెక్టర్ ఆ స్థలాన్ని పరిశీలించి నూతన పాఠశాల భవనానికి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఉత్తరకంచి గ్రామంలో అసంపూర్తి పనులతో నిలిచిపోయిన రెండు అంగన్‌వాడీ భవనాలు, ఒక సచివాలయ భవనాల దుస్థితిని ఆ గ్రామ సర్పంచ్ మంతెన శ్రీను, సుబ్బారెడ్డి సాగర్ చైర్మన్ ఇళ్ళ అప్పారావుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వేములపాలెంలోని గ్రామదేవత ఆలయం తదితర సమస్యలను టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి లొండా లోవరాజు, గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ప్రత్తిపాడులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. వైద్యాధికారులు స్వప్న, సౌమ్యలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ప్రస్తుతం వార్డులో వైద్య సేవలు పొందుతున్న మహిళతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యుల ప్రవర్తన, భోజన వసతి వంటిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు ఆసుపత్రిలో ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటుచేసి శస్త్రచికిత్స నిపుణులను ఏర్పాటుచేయాలని వైద్యులు కలెక్టర్‌ను కోరారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న హోమియో ఆసుపత్రిని కూడా కలెక్టర్ పరిశీలించారు. అలాగే పెద్దిపాలెం ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించి ఆసుపత్రి పరిశుభ్రంగా ఉండాలని, వైద్యాధికారి యశశ్వికి సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం చిన్నారులకు ప్రతి దినం సక్రమంగా పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఉత్తరకంచిలో పల్లె పండుగలో భాగంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని తహశీల్దార్ సూర్యప్రభ, ఎంపీడీవో కుమార్‌బాబు, పీఆర్‌జేలతో కలిసి పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఎంఎస్ ఐటీసీఈఈ సీహెచ్ రత్నంరాజు, ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాథ్, సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

జిల్లావ్యాప్తంగా 18,799 మంది విద్యా కమిటీ సభ్యులకు శిక్షణ

సమగ్ర శిక్ష సీఎంవో చామంతి నాగేశ్వర్రావు

తొండంగి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాల యాజమాన్య కమిటీలకు శిక్షణలో భాగంగా జిల్లావ్యాప్తంగా 18,799 మంది కమిటీ సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్టు సమగ్ర శిక్ష సీఎంవో చామంతి నాగేశ్వర్రావు చెప్పారు. శుక్రవారం ఆయన తొండంగిలో జరుగుతున్న రిసోర్స్‌పర్సన్ల శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. హాజరైన ప్రధానోపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్లను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అక్టోబరు 7, 8, తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా అగిరపల్లి వద్ద రాష్ట్రస్థాయిలో ముగ్గురు ఉపాధ్యాయులు, ఇద్దరు చైర్మన్లకు ఆర్పీలుగా శిక్షణ ఇచ్చారన్నారు. జిల్లాలో రెండు డివిజన్లకు కలిసి పది మంది శిక్షణ పూర్తి చేశారన్నారు. డిసెంబరు 30న వీరి ద్వారా మండలానికి ఐదుగురు చొప్పున 21 మండలాలకు 105 మంది ఆర్పీలకు శిక్షణ ఇచ్చామన్నారు. వీరి ద్వారా మండలస్థాయిలో డిసెంబరు 31, జనవరి 2వ తేదీల్లో 2556 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. వీరి ద్వారా పాఠశాలల స్థాయిలో 18,799 మంది విద్యాకమిటీ సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఏర్పాటు, విధులు- బాధ్యతలు, బాలల హక్కులు - పరిరక్షణ, సమావేశాలు నిర్వహణ - విధివిధానాలు, పాఠశాల అభివృద్ధి ప్రణాళిక, పాఠశాల అభివృద్ధి ప్రజల భాగస్వామ్యం, సమకాలీన సమస్యలు - పరిష్కారాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. ఎంఈవోలు షేక్ బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.




ఆంధ్రజ్యోతి/సర్పవరం జంక్షన్


ఆ ఇల్లు..హరిత నందనవనం

మిద్దె తోటల సాగులో ఆదర్శం

ఆరేళ్లుగా ఆర్గానిక్ విధానంలో ఫలసాయం
650కి పైగా పూలు, పండ్ల మొక్కల పెంపకం
ఏరువాక, రైతునేస్తం అవార్డులు సాధించిన
కాకినాడకు చెందిన రాధ











ఆమె ఇల్లు ఓ హరిత నందనవనం. ఆ ఇంటికి వెళ్లగానే ఏజెన్సీ ప్రాంతానికి వెళ్తున్నామా అన్న అనుభూతి కలుగుతుంది. ఇల్లంతా గుబురుగా ఉండే పలు రకాల పచ్చని పండ్ల మొక్కలు, పువ్వులతో పరిమళాన్ని వెదజల్లుతూ ఎంతో ఆహ్లాదమైన వాతావరణం స్వాగతం పలుకుతుంది. మొక్కల పెంపకంపై ఉన్న ఆసక్తి మిద్దె తోటల సాగువైపు వెళ్లేలా కంకనాలపల్లి రాధను ప్రేరేపించింది. ఆరేళ్లుగా సంప్రదాయ సిద్ధంగా సేంద్రియ విధానంలో మిద్దె తోటల సాగు చేస్తూ ప్రతిష్టాత్మకమైన ఏరువాక, రైతు నేస్తం అవార్డులు సాధించి ఇతరులకు మార్గదర్శకంగా నిలిచారు.

మిద్దె తోటలకు కేరాఫ్‌గా..

కాకినాడ రెండో డివిజన్ దుర్గా విద్యుత్‌నగర్‌కు చెందిన కంకనాలపల్లి మురళీగోపాలకృష్ణ, రాధలు భార్యాభర్తలు. భర్త ఇరిగేషన్‌శాఖలో ఈఈగా పనిచేసి 18ఏళ్ల కిందట పదవీ విరమణ చేశారు. వీరి తల్లిదండ్రులది వ్యవసాయ కుటుంబం కావడంతో చిన్ననాటి నుంచి మొక్కల పెంపకాన్ని అలవాటుగా చేసుకున్నారు. ఇప్పుడు నేడు మొక్కలు లేనిదే జీవితం లేనంతగా వాటిపై ప్రేమను పెంచుకున్నారు. రెండు దశాబ్ధాలుగా కాకినాడలో సొంతింట్లో జీ ప్లస్ టూ భవన సముదాయాన్నే మిద్దె తోటల పెంపకం కేంద్రంగా చేసుకుని గ్రౌండ్, ఫస్ట్, సెకండ్ ఫ్లోర్‌లపై 650కిపైగా పలు రకాల మొక్కలు, పండ్ల మొక్కలు, కాయగూరలు, ఆకుకూరలు, పూల మొక్కలను పెంచుతున్నారు. వీటిని కడియం, బెంగళూరు, హైదరాబాద్‌తోపాటు నర్సరీలు, ఆన్‌లైన్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు.

సేంద్రియ సాగుతో మేలు

సేంద్రియ విధానంలో మిద్దె తోటల సాగుతో కుటుంబ సభ్యులంతా ఆరోగ్యంగా జీవించవచ్చు. ఖాళీ స్థలం అవసరం లేదు. ఇంటి ఆవరణ, పై అంతస్తులో ఉన్న కొద్దిపాటి స్థలంలో వివిధ రకాలైన ఫల, పుష్పాలు, ఆకు, కాయగూరల సాగు చేపట్టవచ్చు. 50 ఏళ్లుగా భర్త సహకారంతో మొక్కలు పెంచడాన్ని అలవాటుగా చేసుకున్నా. ఇంట్లో సాగు చేసిన ఫలసాయాన్నే ఆహారంగా తీసుకుంటున్నాం.

-కంకనాలపల్లి రాధ, కాకినాడ



అవార్డులు..

మిద్దె తోటల పెంపకంపై ఆరేళ్లుగా రాధ సేంద్రీయ విధానంలో అనుసరిస్తున్న ఉత్తమ ఆచరణీయ పద్ధతులు, ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు. మిద్దె తోటల పెంపకంపై ఇతరులకు అవగాహన కల్పిస్తూ, చైతన్యం తీసుకొస్తున్నందుకుగాను 2023 ఏడాదికిగాను ఉత్తమ ప్రోత్సాహిక మిద్దె తోటల నిర్వాహకురాలిగా తెలంగాణా, ఏపీల నుంచి ఈమెకు విజయవాడ, హైదరాబాద్‌కు చెందిన ఏరువాక ఫౌండేషన్, రైతు నేస్తం అవార్డులు ప్రదానం చేశారు.

సేంద్రియ విధానంలో సాగు..



సంప్రదాయ పద్ధతిలో కేవలం ఇంట్లో వినియోగించే సహజసిద్ధమైన వనరులు, వ్యర్థాలను ఉపయోగించి సహజ ఎరువును కంకనాలపల్లి రాధ తయారు చేసుకుంటున్నారు. బయోచారు, వర్మీ కంపోస్టు, డీకంపోస్టు తదితర వాటిని ఇంటి పెరట్లోనే సేంద్రియ ఎరువు(మెన్యూర్) తయారు చేస్తున్నారు. సొంతంగా సేంద్రియ పద్ధతుల్లో తయారు చేసిన ఎరువునే మిద్దెతోటల్లో పెంపకంలో సాగుచేస్తున్నారు. పూల మొక్కల్లో గులాబీ, చామంతి, మల్లెపూలు, మందారం, సంపంగి, నందివర్ధనం తదితర రకాలు ఉన్నాయి. పండ్ల జాతుల్లో బత్తాయి, నారింజ, జామ, ద్రాక్ష, మల్బరీ, మామిడి కాయతోపాటు అరుదుగా లభిస్తున్న డ్రాగన్ ఫ్రూట్, స్వీట్, కివీ కాయ, ఖర్బూజ తదితరాలు ఉన్నాయి. ఆకుకూరల్లో తోటకూర, మెంతు కూర, పొన్నగంటి, పుదీన, కొత్తిమీర, చుక్కకూర, కాయకూరల్లో వంకాయ, బెండ, చిక్కుడు కాయ, మునగ, ఆనబకాయ, పసుపు, టమాటా, అల్లం తదితర కాయకూరలు సాగు చేస్తున్నారు. ఆకర్షణీయంగా కనిపించే స్నేక్ ప్లాంట్, పీస్ లిల్లీ, జడ్ ప్లాంట్లు, మనీ ప్లాంటు, బోన్సాయ్ వంటివి కూడా పెంచుతున్నారు. మొక్కలు పెంచే కుండలకు వివిధ రకాల రంగులు వేసి పూల మొక్కల సాగు చేపట్టడంతో ఆకర్షణీయంగా మారింది.



వీసీ మురళీకృష్ణ నుంచి పుస్తకాలు అందుకుంటున్న విద్యార్థిని

ఫ్రాన్స్‌లోని ఓపెన్ లైబ్రరీ స్ఫూర్తిగా....

ఫ్రీబుల్ ద బుక్ బఫే

జేఎన్టీయూకేలో ప్రారంభించిన ఇన్‌చార్జి ఉప కులపతి మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఫ్రాన్స్‌లోని ఓపెన్ లైబ్రరీని స్ఫూర్తిగా తీసుకుని జేఎన్టీయూకేలో ఫ్రీబుల్ ద బుక్ బఫే కార్యక్రమం చేపట్టామని ఇన్‌చార్జి ఉప కులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్సిటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన 'ఫ్రీబుల్ ద బుక్ బఫే'ను వీసీ ముఖ్య అతిథిగా పాల్గొని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో ఫేస్‌బుక్‌కి అలవాటుపడిన విద్యార్థులు పుస్తక పఠనాన్ని విస్మరిస్తున్నారన్నారు. దానిపై ఆసక్తి కలిగించేలా ఈ ఫ్రీబుక్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వివరించారు. క్యాంపస్‌లో మూడుచోట్ల దీనిని చేపడతామన్నారు. ప్రజలు, నగర ప్రముఖులు, అధ్యాపకులు అందజేసిన సాధారణ, సాంకేతిక పుస్తకాలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీ రీడింగ్ రూమ్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. పుస్తకాలు లేని భవన సముదాయానికి చక్రవర్తిగా ఉండేకన్నా పుస్తకాలు ఉన్న పూరిగుడిసెకు కాపలాదారుగా ఉండడమే సంతోషమన్నదే తెలుగువాడి డీఎన్ఏ అని వీసీ పేర్కొన్నారు. ప్రతి రోజూ గ్రంథాలయంలో చదువుకోవచ్చన్నారు. ప్రతి శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తమకు నచ్చిన రెండు పుస్తకాలను విద్యార్థులు ఉచితంగా తీసుకుని మిగిలిన రోజుల్లో చదువుకునేందుకు తీసుకెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వరరావు, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు, పలువురు డైరెక్టర్లు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



సామర్లకోట గూడ్స్‌యార్డ్‌లో దిగుమతి అవుతున్న బిహార్ ధాన్యం

సామర్లకోటకు బిహార్ ధాన్యం

2,400 మెట్రిక్ టన్నులు దిగుమతి

సామర్లకోట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే గూడ్స్ యార్డుకు బిహార్ నుంచి రెండు గూడ్స్ రైళ్ల ద్వారా 2,400 మెట్రిక్ టన్నుల ధాన్యం గురువారం దిగుమతి అయ్యింది. ఇందుకు సామర్లకోట ఏడీబీ రోడ్డులోని ఒక భారీ రైస్‌మిల్లు రైల్వే శాఖకు రవాణా చార్జీగా రూ.90 లక్షలు చెల్లించింది. ఈ ఏడాది సామర్లకోట గూడ్స్ యార్డుకు బిహార్ నుంచి ధాన్యం దిగుమతి అవ్వడం ఇదే మొదటిసారి అని రైల్వే గూడ్స్ యార్డు అధికారులు తెలిపారు. తద్వారా సామర్లకోటకు చెందిన సుమారు 300 మంది హమాలీ జట్టు కూలీలకు, 200 లారీలకు ఉపాధి లభించింది.

రేపు 'గేమ్ ఛేంజర్' ప్రీ రిలీజ్ ఈవెంట్

ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాక
రామ్‌చరణ్, సినిమా టీమ్ హాజరు
లక్ష మంది వస్తారని అంచనా
వేమగిరి సమీపంలో భారీ ఏర్పాట్లు

రాజమహేంద్రవరం/కడియం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరి సమీపంలోని జాతీయ రహదారి (గతంలో తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహించిన) స్థలంలో ప్రముఖ నటుడు రామ్‌చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను శనివారం నిర్వహించనున్నారు. ఇందుకు గాను భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు లక్ష మంది అభిమానులు హాజరుకావొచ్చని చిరంజీవి అభిమాన సంఘం నాయకుల కథనం. శనివారం సాయంత్రం ఆరు నుంచి 9.30 గంటల వరకు ఈవెంట్ నిర్వహిస్తారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హాజరుకానున్నారు. ఆ రోజు సాయంత్రం మధురపూడి విమానాశ్రయానికి వచ్చి అక్కడి నుంచి కారులో షెల్టన్ హోటల్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ఈవెంట్ స్థలానికి వెళ్తారు. ఈ మేరకు తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ పోలీసు అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యే సభాస్థలిని పరిశీలించారు.



ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగే గ్రౌండ్ (పైన), ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్ (కింద)



ట్రాఫిక్ మళ్లింపు, భద్రత తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు, ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమానికి రామ్‌చరణ్‌తో పాటు నటులు కైరా అద్వానీ, అంజలి, ఎస్‌జే సూర్య, దర్శకుడు శంకర్, దిల్ రాజు, సంగీత దర్శకుడు తమన్ హాజరుకానున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన చిరంజీవి అభిమాన సంఘ నేతలు తాడితోటలో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఏఏ ప్రాంతాల నుంచి ఎంత మంది వస్తారో ఓ అంచనా వేశారు. ఈవెంట్‌ను సక్సెస్ చేయాలని అఖిల భారత చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు రవణం స్వామినాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏడిద బాబి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు గెద్దం శివ, రామ్‌చరణ్ అభిమాన యువశక్తి నేత శివ చెర్రీ, మెగా అభిమానుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలకు నలుగురి ఎంపిక

23న దుప్పలపూడిలో ప్రదానం

అనపర్తి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలోని శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఏటా పలువురు ప్రముఖులకు అందజేసే స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలు-2025కు పలు రంగాల్లో నిష్ణాతులైన నలుగురిని ఎంపిక చేసినట్టు రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్ గురువారం విలేకరులకు వెల్లడించారు. జీవన సాఫల్య పురస్కారాలను శాసనసభ పూర్వ ఉప సభాపతి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, చిలుకూరి బాలాజీ దేవస్థానం ప్రధానార్చకుడు సీఎస్ రంగరాజన్, రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారు, బ్యారేజీల నిపుణుడు నాగినేని కన్నయ్యనాయుడులకు. స్వామి వివేకానంద ఎక్సలెన్స్ అవార్డును ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, గౌడీయ సంప్రదాయకుడు రాధా మనోహరదాస్ ప్రభూజీలకు అందించనున్నట్టు వెల్లడించారు. ఈ నెల 23న అనపర్తి సమీపంలోని దుప్పలపూడి ఆర్‌వీఆర్ కన్వెన్షన్ హాలులో జరిగే కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ అవార్డుతో పాటు జ్ఞాపిక, రూ.25వేల నగదు అందిస్తారని దుర్గాప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ పాల్గొంటారన్నారు.

యానాంలో 6 నుంచి ప్రజా ఉత్సవాలు

యానాం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో ప్రజా ఉత్సవాలు, ఫల, పుష్ప ప్రదర్శనల నిర్వహణపై పరిపాలనాధికారి మునిస్వామి గురువారం అధికారులతో సమీక్షించారు. ముఖ్య అతిథిగా హాజరైన పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పుదుచ్చేరి ముఖ్యమంత్రి, గవర్నర్, మంత్రులు, ఇతర ఉన్నతాధికారుల పర్యటనలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అక్కడి నుంచే సీఎం, ఇతర మంత్రులు, అధికారులతో మాట్లాడి వారి పర్యటనలను ఖరారు చేశారు. 6వ తేదీన ఉత్సవాలు ప్రారంభించనున్న సీఎం రంగసామి పలు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టనున్నారు. 8న ముగింపు ఉత్సవాలకు విచ్చేసే గవర్నర్ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ అంశాలపై చర్చించారు. ప్రజా పనులు, మత్స్య, సాంఘిక, పౌరసరఫరాలు, పశువైద్య, వ్యవసాయ, మున్సిపాలిటీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యానాం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు, మహిళలకు గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. 23వ ఫల, పుష్ప ప్రదర్శన సందర్భంగా శ్రీటంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలో పోటీలు నిర్వహించారు. సందేశాత్మకమైన ముగ్గులు వేసి అకట్టుకున్నారు. వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివసుబ్రమణియన్ ముగ్గులను పరిశీలించారు. ఉత్తమ ముగ్గులకు యానాం ప్రజా ఉత్సవాలు, ఫల, పుష్ప ప్రదర్శన సభలో బహుమతులు అందజేయనున్నారు.



ప్రజా ఉత్సవాల ఆహ్వాన పత్రికలను అవిష్కరిస్తున్న మల్లాడి కృష్ణారావు, అధికారులు




ముగ్గులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివసుబ్రమణియన్, పోటీలో ఆకట్టుకున్న ముగ్గు

భగీరథ యత్నం..!

- సాగు నీటి కోసం గోదావరి ఇసుక తిన్నెల్లో ఊట బావులు
- పది నుంచి 15 అడుగుల లోతు వరకు తవ్వకాలు
- మిర్చి పంటకు తడుల కోసం రైతుల తంటాలు



ఊట బావిలో ఇసుకను తోడుతున్న దృశ్యం



ఇసుక తిన్నెల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ మోటార్లు, ఊట బావి నీటిని పంట తడులకు వినియోగిస్తున్న దృశ్యం

ఎటపాక, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో మిర్చి పంట సాగుచేసిన రైతులు నీటి తడుల కోసం భగీరథ యత్నాలు చేస్తున్నారు. పంటకు సాగునీటికి ప్రతి నీటిబొట్టును ఒడిసి పడుతున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో సాగు చేపట్టిన పంటకు సాగునీటికి రైతులు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రాంత రైతులు మిర్చి పంటను కాపాడుకు నేందుకు అదనపు ఖర్చుల భారంతో పడరాని పాట్లు పడుతున్నారు. గోదావరినది చెంతనే ఉన్నా రైతులకు సాగునీటి కష్టాల సమస్య తొల గడం లేదు. విలీన మండలాల్లో ప్రధానంగా గోదావరి నదీ పరివాహక ప్రాంతాలతోపాటు లంక ప్రాం తాల్లో మిర్చిపంటను సాగుచేసిన రైతులు ఏటా సాగునీటికి ఇసుక తిన్నెల్లోని ఊట బావిలపై ఆధారపడుతుంటారు. ఎటపాక మండలంలో ఈ ఏడాది 1,900 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. గోదావరి వరదల భయంతో ఈ ఏడాది రైతులు అక్టోబరు నెల చివరి వరకు పంటను సాగు చేశారు. మొన్నటివరకు గోదావరి నదీ పాయలో నీరు ఉండేది. పాయలో నీరు ఇంకిపోవడంతో రైతులు ఊట బావిల వైపు చూస్తున్నారు. ఈక్రమంలో ప్రధానంగా గన్నవరం, గౌరిదేవిపేట, నందిగామ, మురుమూరు గోదా వరి పరివాహక ప్రాంత రైతులు ఊట బావిలను తవ్వుతున్నారు. గతంలో తవ్విన గుర్తులున్న (వరలు)ల్లోని ఇసుకను తొలగిస్తూ ఊట బావిలుగా ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రస్తు తం పది నుంచి 15 అడుగుల వరకు ఊట బా వులను తవ్వుతున్నారు. బావిలో ఊరే ఊట నీటిని తడులకు వినియోగిస్తున్నారు. ఊట తగ్గితే నీటి కోసం మరింత లోతు తీస్తున్నారు. తమకు అదనపు ఖర్చులు అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటి నుంచి ఫిబ్రవరి చివరి వరకు మిర్చిపంట సాగునీటికి గోదావరిలో ఇసుకతిన్నె ఊట బావిలపైనే ఆధారపడుతుంటారు.

ఒక్కో ప్రాంతానికి.. ఒక్కో మెనూ



కొత్త మెనూ ఇలా..

సోమవారం: అన్నం, ఆకుకూరతో పప్పు, గుడ్డు ఫ్రై, చిక్కీ
మంగళవారం: పులిహోర, చట్నీ, ఉడికించిన గుడ్డు, రాగిజావ
బుధవారం: అన్నం, కూరగాయల కూర, గుడ్డు ఫ్రై, చిక్కీ
గురువారం: వెజ్‌రైస్/పలావ్, బంగాళ దుంప కుర్మా, ఉడికించిన గుడ్లు, రాగిజావ
శుక్రవారం: అన్నం, ఆకుకూరతో పప్పు, గుడ్డు ఫ్రై, చిక్కీ
శనివారం: అన్నం, కూరగాయల కూర, స్వీట్ పొంగల్, రాగిజావ

- సరికొత్తగా మధ్యాహ్న భోజన పథకం
- స్థానిక రుచులకు ప్రాధాన్యమిచ్చేలా మెనూ
- సంక్రాంతి తర్వాత అమలుకు చర్యలు

పెద్దాపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూలో ప్రభుత్వం మార్పులు చేయనుంది. ఈ మార్పులను జోన్లవారీగా నిర్ధారించనున్నట్లు తెలుస్తోంది. ప్రాంతాల వారీగా విద్యార్థుల ఆహారపు అలవాట్లు ఆసక్తిగా తినే ఆహారం ఆధారంగా ఈ మెనూను రూపొందించింది. విద్యార్థులకు మంచి పోషకాలు అందేలా ఈ మెనూను రూపొందించారు. సంక్రాంతి సెలవుల తర్వాత పాఠశాలల్లో దీన్ని అమలులోకి తీసుకురానున్నట్లు తెలుస్తోంది. వారంలో మంగళవారం మాత్రం రెండు రకాల మెనూలు ఇచ్చారు. విద్యార్థుల ఆసక్తి మేరకు ఏదో ఒకదాన్ని చేస్తారు.

ఒకటే మెనూ కావడంతో..

వైసీపీ హయాంలో మధ్యాహ్న భోజనం తినేందుకు విద్యార్థులు ఆసక్తిని చూపలేదు. ప్రస్తుతం అమలుచేస్తున్న మెనూ రాష్ట్రవ్యాప్తంగా ఒకటే కావడంతో కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులు అంత ఇష్టంగా భోజనం చేయడం లేదు. దీన్ని గమనించిన కూటమి ప్రభుత్వం మార్పులు చేయాలని నిర్ణయించింది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు,విద్యారంగ నిపుణుల సూచనలు తీసుకుంది.

ప్రక్షాళన దిశగా..

కొత్తగా నిర్ణయించిన మెనూను సంక్రాంతి తర్వాత అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పెరుగుతున్న విద్యార్థులకు మంచి పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను అందించడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండడంతోపాటు ఉత్సాహంగా చదువుకునేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెప్తున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పథకం అమలుపై ప్రత్యేక దృష్టిసారించి దశలవారీ ప్రక్షాళన చేస్తున్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు

- మూడోరోజు 268మంది హాజరు

కాకినాడ క్రైం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మూడో రోజైన గురువారం 268మంది హాజరు కాగా 185మంది తదుపరి పరీక్షకు అర్హత సాధించారు. ఈ ప్రక్రియను కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ స్వయంగా పర్యవేక్షించారు.



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు



లాంగ్ జంప్ చేస్తున్న యువకుడు

రైలునుంచి జారి పడి వ్యక్తి మృతి

తునిరూరల్,జనవరి 2(ఆంధ్రజ్యోతి): తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో కదులుతున్న రైలునుంచి జారి పడి వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం తుని గుల్లిపాడు రైల్వేస్టేషన్ మధ్య పాయకరావుపేట ఇందిరాకాలనీ సమీపాన రైలుపట్టాలపై రైలునుంచి జారి పడి 21ఏళ్ల వయసు గల యువకుడు మృతి చెందాడని, మృతుడి ఆచూకీ వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించామని తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీస్‌స్టేషన్ నెంబరు 9490619020ను సంప్రదించాలని కోరారు.

అర్ధరాత్రి డివైడర్‌ను ఢీకొని.. ఇద్దరు యువకుల మృతి

- ఇద్దరూ వరుసకు అన్నదమ్ములు
- గండేపల్లి మండలం మురారిలో ఘటన

జగ్గంపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో మురారి గ్రామ శివారున బుధవారం అర్ధరాత్రి బైక్ డివైడర్‌ను ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. ఇద్దరూ వరుసకు అన్నదమ్ములు అయ్యేవారు. తూర్పుగోదావరి జిల్లా మోరంపూడికి చెందిన లింగం నవీన్(21), సంతోష్(20) అన్నదమ్ముల బిడ్డలు. దీంతో వీరిద్దరూ కూడా అన్నదమ్ములవుతారు. వీరు కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరంలో తన స్నేహితుడిని బుధవారం అర్ధరాత్రి ఇంటివద్ద దింపారు. తిరిగి ఇంటికి వస్తుండగా గండేపల్లి మండలం మురారి గ్రామ శివారునకు వచ్చేసరికి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. నవీన్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక ఎస్ఐ నాగబాబు సంఘటన స్థలానికి చేరుకుని సంతోష్‌ను రాజమహేంద్రవరం తరలించారు. ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. నవీన్ మృతదేహాన్ని పెద్దాపురం పోస్టుమార్టానికి తరలించారు.



నవీన్, సంతోష్ (ఫైల్)

సంఘటనాస్థలంలో లింగం నవీన్, సంతోష్

మోరంపూడిలో విషాదం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం మురారి వద్ద డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో అన్నదమ్ములు లింగం నవీన్, లింగం సంతోష్ కుమార్‌ల మృతిచెందడంతో వీరి స్వస్థలం మోరంపూడిలో విషాదం అలుముకుంది. వీరిలో నవీన్ సూరంపాలెం ఆదిత్యలో బీటెక్ చదువుతున్నాడు. సంతోష్ తాపీ పని చేసుకుంటున్నాడు. నవీన్ తండ్రి గతంలో కరెంట్ షాక్‌తో మరణించడంతో అతడ్ని తల్లి వరలక్ష్మి కొడుకును ఇంజనీరింగ్ చదివిస్తోంది. కుమారుడి మృతితో ఆమె విలపిస్తోంది. లింగం సంతోష్ తండ్రి రత్నంరాజు కూడా తాపీపని చేస్తుంటాడు. పిల్లల మృతితో రెండు కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి.

సముద్రంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

- మూడుకు చేరిన మృతుల సంఖ్య
- కన్నీరుమున్నీరుగా విలపించిన నానమ్మ

సర్పవరం జంక్షన్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట సముద్రంలో గల్లంతైన బొర్ర శ్రీనుబాబు(17) మృతదేహం గురువారం ఎన్టీఆర్ ఓల్డ్ బీచ్‌లో లభ్యమైంది. నూతన సంవత్సరం వేళ కొత్తపల్లి మండలం కోనపాపపేట శివారు మల్లివారితోటకు చెందిన గుత్తుర్తి సతీష్‌కుమార్(17), కాకినాడ రామకృష్ణారావుపేట ఎర్రరోడ్డుకు చెందిన వడిసెల గౌరీలక్ష్మీనాగసాయి(16) సముద్రంలో బుధవారం వేర్వేరుగా గల్లంతై మృతిచెందిన విషయం తెలిసిందే. వడిసెల గౌరీలక్ష్మీనాగసాయితో కలసి సముద్రస్నానానికి వెళ్లి బొర్ర శ్రీనుబాబు గల్లంతయ్యాడు. అతడి కోసం పోలీసులు మత్స్యకారులతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం సూర్యారావుపేట సాగరతీరానికి శ్రీనుబాబు మృతదేహం కొట్టుకువచ్చినట్లు మత్స్యకారులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు మృతదేహాన్ని పరిశీలించి శ్రీనుబాబుగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆశలు ఆవిరి

కుమారుడు అనారోగ్యంతో మృతి చెందడం, తర్వాత కోడలు ఇంటి నుంచి వెళ్లిపోవడంతో మనవడు బాగోగులు, సంరక్షణ బాధ్యత నానమ్మ బొర్ర దుర్గపై పడింది. వయసు మీద పడినా ఇళ్లల్లో పాచిపనులు చేస్తూ ఉన్నంతలో చదివిస్తోంది. కొత్త సంవత్సరంలో సరదాగా స్నేహితులతో బీచ్‌కు వెళ్లి వస్తానంటూ చెప్పి ఇంటి నుంచి వెళ్లిన మనవడు ఇలా అర్ధంతరంగా సముద్రంలో గల్లంతు కావడం, తర్వాత విగతజీవిగా మారడాన్ని చూసిన నానమ్మ దుర్గ కన్నీరుమున్నీరుగా విలపించింది. నానీ నానీ అంటూ ఎప్పుడు వెన్నంటి ఉంటే మనవడికోసం రోధించడం చూపరులకు బాధ కలిగించింది.



బీచ్‌లో మృతదేహం.. ఇన్‌సెట్‌లో శ్రీను(ఫైల్)

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

జగ్గంపేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గండేపల్లి హైవేపై గురువారం రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. రాజమండ్రివైపు నుంచి దేవరపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు మోటారుసైకిల్‌పై జగ్గంపేట వైపు వస్తున్నారు. వెనుకనుంచి వస్తున్న మోటారు సైకిల్ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని పోలీసులు ఆసుపత్రికి తరలించారు.

పోర్టు ఎల్‌డీసీగా సుబ్రహ్మణ్యం

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టులో లేబర్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా ఎన్.సుబ్రహ్మణ్యాన్ని ప్రభుత్వం నియమించింది.ఆయన విజయనగరం లేబర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై కాకినాడపోర్టుకు వస్తున్నారు.

నేడు దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

కాకినాడలో జిల్లాస్థాయి పోటీలు

కాకినాడ రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సాలిపేటలోని పీఎస్‌రాజు మున్సిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాల్లో దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన-2025కు సంబంధించిన జిల్లాస్థాయి పోటీలను కాకినాడ డీఈవో పిల్లి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ తెలిపారు. బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నలాజికల్ మ్యూజియం వారి సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. భౌతిక, రసాయన శాస్త్రాలు, గణితం, భూమి అంతరిక్షశాస్త్రం, జీవ, పర్యావరణ, జీవరసాయన, కంప్యూటర్ శాస్త్రాలు వంటి ఉప అంశాల్లోను ఉపాధ్యాయుల, విద్యార్థుల వ్యక్తిగత ప్రదర్శన, విద్యార్థుల గ్రూప్ ప్రదర్శన వంటి విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లాలోని ప్రతి మండలంనుంచి వ్యక్తిగత విభాగంలో 42, గ్రూప్ విభాగంనుంచి 42, ఉపాధ్యాయుల విభాగం నుంచి 42 మొత్తం 126 ప్రాజెక్టులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యాయన్నారు. వివరాలకు 9912788333 నెంబర్లో సంప్రదించాలన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న సైన్స్ అధికారి, డీఈవో

తాళ్లపొలంలో స్కూటీ దగ్ధం

తనపై కొందరు దాడి చేశారంటూ ఏరియా ఆస్పత్రిలో చేరిన వ్యక్తి

కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలంలో ఘటన

ద్రాక్షారామ, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం తాళ్లపొలంలో గురువారం స్కూటీ దగ్ధమైంది. మండలంలోని తాడిపల్లి గ్రామానికి చెందిన పండు రమేష్ తనపై కొంతమంది దాడిచేశారని చెప్పి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేరాడు. తాళ్లపొలంలోని ఒక పొలంలో విత్తనాలు జల్లుతుండగా కొంతమంది తనపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించారని, తాను తప్పించుకున్నానని, దీంతో తన స్కూటర్‌పై పెట్రోల్ పోసి తగులపెట్టారని అన్నాడు. పోలీసులు పండు రమేష్ నుంచి వాంగ్మూలం తీసుకున్నట్లు సమాచారం. కానీ, ఇంకా దీనిపై కేసు నమోదు చేయలేదు.



దగ్ధమవుతున్న స్కూటీ

స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జోన్-2 పరిధిలో(ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో) ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సు పోస్టులను ఒక ఏడాది కాలపరిమితితో కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ పద్మాశశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కల్గిన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 17 వరకూ సాయంత్రం ఐదు గంటల్లోగా రాజమహేంద్రవరంలోని వైద్య,ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకుల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు సీఎఫ్‌డబ్ల్యు.ఏపీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. గతంలో నోటిఫికేషన్ నెం.5/2022, 1-12-2022న కానీ, 1/2023, 20-09-2023 తేదీన కానీ ఇది వరకే నియమితులై పనిచేస్తున్న అభ్యర్థులు దరఖాస్తు చేయడానికి అనర్హులని, వారి దరఖాస్తులు తిరస్కరిస్తామని అన్నారు.

రత్నగిరిపై డిజిటల్ చెల్లింపుల రెండో కౌంటర్ ప్రారంభం

అన్నవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులు, వ్రతం టిక్కెట్లు, దర్శనం, ఇతర సేవల కోసం చేపట్టే నగదు చెల్లింపులతోపాటు డిజిటల్ పేమెంట్ల చెల్లింపునకు గురువారం పశ్చిమ రాజగోపురం వద్ద మరో కౌంటర్‌ను ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ప్రారంభించారు. సాధారణరోజుల్లో మధ్యాహ్నం 2గంటల వరకు పర్వదినాల్లో సాయంత్రం వరకు ఈ కౌంటర్ అందుబాటులో ఉండనుంది.



డిజిటల్ చెల్లింపుతో కొన్న టికెట్‌ను అందజేస్తున్న ఈవో, చైర్మన్

ప్రమాదవశాత్తూ కాలువలో జారిపడి వ్యక్తి మృతి

ఆత్రేయపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కాలువలో జారిపడి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రాము తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన మేడిద శ్రీను(40) జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లి వచ్చాడు. అతడి భార్య రోజా సింగపూర్‌లో ఉంటుంది. శ్రీనుకు ఇద్దరు సంతానం. వీళ్ల పిల్లలు ఆత్రేయపురం మండలం వద్దిపర్రులో వదిన వెంకటలక్ష్మి ఇంటి వద్ద ఉంటున్నారు. డిసెంబరు 31న శ్రీను పిల్లలను చూడడానికి వద్దిపర్రు వచ్చాడు. ఈ నెల 2న తెల్లవారుజామున 3గంటల సమయంలో పంటకాలువలో ప్రమావశాత్తూ జారి పడి మృతిచెందాడు. మృతుడి తమ్ముడు వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు మత్స్యకారులకు నష్టపరిహారం పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), జనవరి2(ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు మండలం కోరంగిలో ఓఎన్‌జీసీ సంస్థ విడుదల చేస్తున్న నష్టపరిహారాన్ని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు శుక్రవారం మత్స్యకారులకు అందజేయనున్నారు. తాళ్లరేవు మండలంలో మొత్తం 7050 మంది లబ్ధిదారులకు రూ.44కోట్ల 59లక్షలు పరిహారం పంపిణీ చేయనున్నారు. ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.63,250 చొప్పున అందజేస్తారు. ఈ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి కోరంగిలో ప్రారంభమవుతుంది. మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం ఉదయం 11గంటలకు కోరంగి చేరుకుంటారు. మధ్యాహ్నం తాళ్లరేవులో మధ్యాహ్న భోజనం స్వీకరిస్తారు. అక్కడినుంచి మధ్యాహ్నం 3గంటలకు సామర్లకోట చేరుకుని రాష్ట్ర గిడ్డంగి గోదాములను ప్రారంభిస్తారు. రాత్రి 8గంటలకు మంత్రి విజయవాడ చేరుకుంటారు.

గొల్లప్రోలులో డంపింగ్‌యార్డు కాంపౌండ్ వాల్ నిర్మాణంపై వివాదం



డంపింగ్‌యార్డు స్థలం వద్దకు వచ్చిన అధికారులను చుట్టుముట్టిన స్థానికులు

- నిర్మాణాలు తొలగించిన స్థానికులు

గొల్లప్రోలు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చెత్తను వేసే డంపింగ్‌యార్డును తరలించమంటే కాంపౌండ్‌వాల్ నిర్మించడంపై గొల్లప్రోలులో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు అడ్డుకోవడంతోపాటు ఇప్పటికే నిర్మించిన కాంపౌండ్‌వాల్‌ను తొలగించారు. గొల్లప్రోలు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం, పీహెచ్‌సీ చెంతనే డంపింగ్‌యార్డు ఉంది. గొల్లప్రోలు పరిధిలోని చెత్తాచెదారాన్ని తెచ్చి ఇక్కడే వేస్తుండడంతో పరిసరాలు దుర్గంధపూరితంగా మారాయి. దీంతో ఈ మార్గంలో వెళ్లలేకపోతున్నామని కొంతకాలంగా ఎస్సీ కాలనీ, అరుంధతీయపేటవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్‌యార్డును ఇక్కడినుంచి తరలించాలని డిమాండ్ చేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు డంపింగ్‌యార్డు వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని ఒకపక్కగా తరలించడంతో కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ సీఎస్ఆర్ నిధులనుంచి రూ.7లక్షలు మంజూరు చేశారు. దీంతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనిపై ఎస్సీ కాలనీ, అరుంధతీయపేటవాసులనుంచి అభ్యంతరం వ్యక్తమైంది. కాంపౌండ్‌వాల్ నిర్మించి చెత్త ఇక్కడే వేస్తే తాము పరిసర ప్రాంతాల్లో ఉండలేమని, పనులు నిలిపివేయాలని వారు అధికారులు, ప్రజాప్రతినిధుల ను కోరారు. తమ డిమాండ్‌కు స్పందన లేకపోవడంతో వారు ఆగ్రహించి ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి కాంపౌండ్‌వాల్ వద్దకు గురువారం సాయంత్రం చేరుకుని పనులు అడ్డుకున్నారు. కాంపౌండ్‌వాల్‌ను, అందుకు ఉపయోగించిన ఇతర కట్టడాలను, ఫెన్సింగ్‌ను తొలగించారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న పోలీసులు వారిని సముదాయించేందుకు ప్రయత్నించినా శాంతించలేదు. పోలీసులు అక్కడ ఉండగానే మరోవైపు నిర్మాణాలు తొలగించారు. కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, ట్రైనీ కలెక్టర్ భావన, తహసీల్దార్ సత్యనారాయణ, ఎం పీడీవో స్వప్న, ఇన్‌చార్జి కమిషనరు ప్రభాకర్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ అక్కడకు చేరుకున్నారు. వారిని ఆందోళనకారులు చుట్టుముట్టారు. వారితో అధికారులు చర్చలు నిర్వహించారు. డంపింగ్ యార్డు పరిసరాలు 2.60 ఎకరాలు ఉందని, ఇందులో 1.50 ఎకరాలను ఎస్సీకాలనీ, అరుంధతీయపేట శ్మశానవాటికలకు కేటాయిస్తామని ఆర్డీవో తెలిపారు. ఆరునెలల్లోగా డంపింగ్ యార్డు స్థల సేకరణ పూర్తి చేసి అక్కడకు తరలిస్తామని చెప్పా రు. వీటిపై తమ నిర్ణయాన్ని తెలియజేయాలని ఆర్డీవో వారికి సూచించగా శుక్రవారం బదులి స్తామని నాయకులు తెలిపారు.

ఆస్తి తగాదాల నేపథ్యంలో పినతండ్రిపై కత్తితో దాడి

తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో ఘటన

కొవ్వూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాల నేపథ్యంలో పినతండ్రిపై కత్తితో దాడిచేసిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం నందమూరు గ్రామంలో చోటుచేసుకుంది. కొవ్వూరు మండలం నందమూరు గ్రామానికి చెందిన గన్నమని లక్ష్మణరావుకు, అతడి అన్నయ్య వెంకట రామారావుకు కొంతకాలంగా భూతగాదాలు ఉన్నాయి. గన్నమణి వెంకటరామారావు, అతడి కుమారుడు సతీష్‌చౌదరి లక్ష్మణరావు నడిచే స్థలాన్ని మూసివేశారు. వ్యవసాయ మోటారు పైపులు, వైర్లను కట్‌చేశారు. దీనిపై లక్ష్మణరావు ప్రశ్నించడంతో భూమి సరిహద్దు విషయమై వివాదానికి దిగారు. లక్ష్మణరావు గురువారం పంట పొలం దున్నుతుండగా సతీష్‌చౌదరి అక్కడికి వెళ్లి తండ్రి వెంకటరామారావు సహకారంతో కొడవలితో దాడిచేశాడు. అడ్డువచ్చిన లక్ష్మణరావు భార్య కృష్ణవేణి చెయ్యిపై దాడిచేయడంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. వారిని రాజమహేంద్రవరంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. లక్ష్మణరావు ఫిర్యాదుపై తండ్రి, కొడుకులపై కేసునమోదు చేశారు.

అధిక ధర ఇస్తానని మోసాలు

కొవ్వూరుకు చెందిన వ్యక్తి అరెస్టు

చాగల్లు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): అధిక ధర ఇస్తామని నమ్మించి ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా మోసగించిన కొవ్వూరుకు చెందిన దుద్దుపూడి సూరిబాబును పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్ఐ కె.నరేంద్ర వివరాల ప్రకారం.. తూర్పుగోదావరిజిల్లా చాగల్లు మండలంలోని దారవరం గ్రామానికి చెందిన గారపాటి సత్తిబాబు నుంచి సూరిబాబు నాలుగు లారీ లోడుల ధాన్యాన్ని తీసుకువెళ్లి డబ్బులు ఇవ్వకుండా మోసగించి పరారీలో ఉన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సూరిబాబును గురువారం అరెస్టు చేసి నిడదవోలు కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు తెలిపారు. అతడిపై కొవ్వూరురూరల్, టౌన్ స్టేషన్లు, సీతానగరం, గోకవరం, జంగారెడ్డిగూడెం, ఐ.పోలవరం, ఒడిశా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్లు ఎస్ఐ తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

5న పిఠాపురంలో ముగ్గుల పోటీలు

పిఠాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్టు ఆలయ అభివృద్ధి సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. విజేతలకు బహుమతులతో పాటు మహిళలకు పార్టిసిపేషన్ గిఫ్టులు అందజేస్తామని చెప్పారు. పాల్గొనదలచిన మహిళలు ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం 12గంటల్లోగా 7093760258కు ఫోను చేసి ఆలయ అర్చకుడు విజయజనార్దనాచార్యులుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.


గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

'పదో' తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

గొల్లప్రోలు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో వారికి స్టడీ మెటీరియల్, ఎస్ఎస్‌సీ మోడల్ టెస్టు పేపర్స్ అందించడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలలు, చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వాటిని దాత, పిఠాపురం, తుని ఏరియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపల్లి తిరుపతిరావు (చినబాబీ), ఉప విద్యాశాఖాధికారి నాయుడు వెంకటేశ్వరరావు, ఎంఈవో శివప్రసాద్ విద్యార్థులకు అందజేశారు. మోడల్ టెస్టుపేపర్ పుస్తకాలను యూటీఎఫ్ ప్రచురించగా బాబీ ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో బాబి, స్రవంతి, చేబ్రోలు పాఠశాల స్థల దాత చల్లా చినబాబు, హెచ్ఎంలు, యూటీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.


అభివృద్ధి కమిటీ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సురేష్

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి

పిఠాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తానని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వేణుం సురేష్ తెలిపారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వాసుపత్రి) అభివృద్ధి కమిటీ సభ్యుడిగా నియమితుడైన సురేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సుజాత ప్రమాణం చేయించారు. ఇప్పటికే సీహెచ్‌సీని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో త్వరలోనే సూపర్ స్పెషాలిటీ వైద్యుల నియామకంతో పాటు అన్ని రకాల అధునాతన వైద్య పరికరాలు అందుబాటులోకి వస్తాయని సురేష్ తెలిపారు. కార్యక్రమంలో ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, పాదగయ మాజీ చైర్మన్ కొండేపూడి ప్రకాష్, నామా దొరబాబు, నల్ల శ్రీనివాస్, కొరుప్రోలు శ్రీను పాల్గొన్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

పెద్దాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని ఎంపీడీవో డి.శ్రీలలిత కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాల యంలో ఐసీడీఎస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కిశోర బాలికా వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రుతుక్రమ సమయంలో పరిశుభ్రత విషయంలో కిశోర బాలికలు జాగ్రత్తలు పాటించాలన్నారు. డాక్టర్ చంద్రకిరణ్, సీడీపీవో ఉష తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలలిత

జీజీహెచ్‌లో గుమస్తా వీరంగం

కాకినాడ క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఓ గుమస్తా గురువారం వీరంగం సృష్టించాడు. పదేళ్లకు పైగా ఒకే సీటులో కొనసాగుతున్న అతడి సీటు మారుస్తూ ఆదేశాలు జారీ చేయడంతో ఈ వివాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... కాకినాడ జీజీహెచ్‌లో మెడికల్ రీయింబర్స్‌మెంట్ సీటు గుమస్తాగా టీఎస్ఎల్ఎన్ మూర్తి అలియాస్ సాయి విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా అవినీతి ఆరోపణల నేపథ్యంలో అతడి సీటును మారుస్తూ రెండు నెలల క్రితం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ఆదేశాలు జారీ చేశారు. ఆ సమయంలోనే అతడు సీటు మార్పును వ్యతిరేకిస్తూ జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌తో ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో సాయి వివాదాస్పదంగా వ్యవహరిస్తూ అదే సీటులో కొనసాగుతున్నాడు. అయితే పాలనాపరమైన సర్దుబాట్లు చేస్తూ సాయితో పాటు మరో నలుగురికి సీట్లు మారుస్తూ గత నెల 31న ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం సూపరింటెండెంట్ చాంబర్‌లో మీటింగ్ జరుగుతున్న సమయంలో సాయి దురుసుగా తలుపు తోసుకొచ్చి సీటు మార్పునకు సంబంధించిన పత్రాలను సూపరింటెండెంట్ ముఖంపై కొట్టి.... నా గురించి ఏమనుకుంటున్నారు, నా సీటు ఎందుకు మారుస్తున్నారు, మీ అంతు చూస్తానంటూ అడ్మినిస్ట్రేటరు, సూపరింటెండెంట్‌లకు వార్నింగ్ ఇచ్చాడు. ఈ విషయమై డాక్టర్ లావణ్యకుమారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో అడ్మినిస్ట్రేటర్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం సాయిని పోలీసులు వన్ టౌన్‌కు తరలించి విచారణ చేస్తున్న సమయంలో ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహన్ ఆధ్వర్యంలో నాయకులు సాయిని స్టేషన్ బెయిల్‌పై తీసుకెళ్లినట్టు తెలిసింది.

బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

తాళ్లరేవు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కోరింగలో బుధవారం జరిగే బహిరంగ సభ ఏర్పాట్లను ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు గురువారం పరిశీలించి నిర్వాహకుడు తొగరు విష్ణుమూర్తితో చర్చించారు. ప్రజలు, అధికారులు, వాహనాలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కోరింగ ఎస్ఐ సత్యనారాయణ, ఎంపీడీవో సత్యనారాయణ, టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, కార్యదర్శి కట్టా త్రిమూర్తులు, ధూళిపూడి వెంకటరమణ, కార్యదర్శులు వీజేవీ రమణ, రామరాజు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

వాకింగ్ చేస్తున్న యువకుడి సెల్ చోరీకి యత్నం

కొత్తపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సాయంత్రం వాకింగ్ చేస్తున్న యువకుని చేతిలో సెల్ చోరీకి ప్రయత్నించి ఒక వ్యక్తి ప్రజలకు చిక్కాడు. కొత్తపల్లికి చెందిన ఎం.అజయ్ గురువారం సాయంత్రం సెల్ చేత్తో పట్టుకుని వాకింగ్ చేస్తూ ఉప్పాడ బయల్దేరాడు. చేనేత కాలనీ దగ్గరకు రాగానే ఎదురుగా ఉన్న సినిమా థియేటర్ నుంచి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వస్తూ వాకింగ్ చేస్తున్న అజయ్ చేతిలో సెల్ లాక్కొన్నారు. దీంతో అజయ్ చేతిలో ఉన్నా విడువకుండా కూడా పరిగెత్తడం గమనించిన స్థానికులు బైక్‌ను అడ్డుకున్నారు. ఈ క్రమంలో బైక్‌పై నుంచి ఇద్దరు కిందపడ్డారు. మొబైల్ చోరీకి ప్రయత్నించిన వారిని స్థానికులు పట్టుకుని కొత్తపల్లి పోలీసులకు అప్పగించారు. వారిని విచారిస్తున్నారు.

డ్రైన్లలో పూడిక తొలగింపు ముమ్మరం

సామర్లకోట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన డ్రైన్లలో పూడిక తొలగింపు పనులను రెండు రోజులుగా ముమ్మరం చేశారు. ఎస్‌టీబీ ఎదురుగా డ్రైన్‌పై శ్లాబ్ నిర్మాణాలను ఎక్స్‌కవేటర్ సాయంతో పూర్తిస్థాయిలో తొలగించారు. సుమారు నాలుగు అడుగుల ఎత్తున చేరిన పూడిక తొలగింపు పనులు చేపట్టారు. డ్రైన్‌పై ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగిస్తేనే తాము పూడిక తీయగలమని కాంట్రాక్టర్ కానూరి సత్యనారాయణ చెప్పారు. పనులను టీడీపీ కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ పర్యవేక్షించారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

24గంటల్లో పూడికలు తొలగించకుంటే మేమే తొలగిస్తాం

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ


డ్రైన్లలో పూడిక తీయకపోవడంతో అధ్వానంగా వున్న పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండడం తగదని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పేర్కొన్నారు. పట్టణంలోని 4, 5 వార్డుల్లో మేజర్ డ్రెయిన్‌తో పాటు వార్డుల్లో మురుగు కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో అధ్వానంగా మారిన పారిశుధ్యాన్ని ఆయన గురువారం పరిశీలించారు. నెలకు ఒకసారి కూడా డ్రెయిన్లు శుభ్రపరచకపోవడంతో పరిసరాలు దుర్గంధపూరితంగా మారాయని, తాము మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో బాధపడుతున్నామని అక్కడి ప్రజలు వర్మ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ అధికారులు స్పందించి 24 గంటల్లోగా డ్రెయిన్లల్లో పూడిక తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపరచకుంటే తామే స్వయంగా ఆ పని చేపడతామని అల్టిమేటం జారీ చేశారు. అక్కడి నుంచే కమిషనరుతో ఫోనులో మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని, మెరుగుకు తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదివారంలోగా డ్రెయిన్లు శుభ్రం చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ, డ్రెయిన్లల్లో పూడిక తొలగింపునకు వచ్చిన నిధులను ఎక్కడ ఖర్చు చేశారని ప్రశ్నించారు. తక్షణం ఆ వివరాలు తెలపాలని సూచించారు. తాను శుక్రవారం ఉదయమే వచ్చి పరిశీలన చేస్తానని కమిషనరు తెలిపారు. వర్మ వెంట పలువురు కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు ఉన్నారు.

శివారు ప్రాంతాలకు సాగునీరందేలా చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్


భోగాపురంలో ఎండిపోతున్న నారుమడులను పరిశీలిస్తున్న విజయకుమార్

పిఠాపురం రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏలేరు శివారు ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ తెలిపారు. గురువారం ఆయన భోగాపురం, రాపర్తి గ్రామాల్లో పర్యటించి సాగునీరందక ఎండిపోతున్న వరి పొలాలను పరిశీలించారు. కాలువలను శుభ్రం చేయకపోవడంతో సమస్య ఏర్పడుతోందని గుర్తించిన ఆయన ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. త్వరితగతిన సాగునీరు అందేలా చూడాలని సూచించారు. రైతులు కొత్తగా వరినారుమడులు వేయవద్దని, వెదజల్లు పద్ధతిలోనే వరి పంట వేయాలని కోరారు. వరి సాగు ముందుగా చేపడితే మూడవ పంటగా అపరాలు సాగు చేసుకునే అవకాశం ఉంటుందని, తద్వారా అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. వ్యవసాయ శాఖ ఏడీ పి.స్వాతి, ఏవో అచ్యుతరామయ్య, వీఏఏ చంద్రశేఖర్, రైతులు అడపా వెంకటరమణ, కట్టా నూకరాజు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో విద్యా కమిటీల పాత్ర కీలకం

గొల్లప్రోలు రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధిలో విద్యా కమిటీల పాత్ర కీలకమని కాకినాడ డీవైఈవో నాయుడు వెంకటేశ్వరరావు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పట్టణం, మండలంలోని 41 పాఠశాలల విద్యా కమిటీల చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యా బోధన, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాలలను అభివృద్ధి చేయడం తదితర అంశాలపై కమిటీలు ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలన్నారు. సమగ్ర శిక్షా సీఎంవో చామంతి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యా కమిటీలు పాఠశాలలను అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. కోర్స్ డైరెక్టర్, ఎంఈవో శివప్రసాద్, ఆర్పీలు శ్రీనివాసరావు, కేఎస్ఆర్ మూర్తి, డి.శ్రీకాంతి, సీఆర్ఎంటీలు ఆకుల రామకృష్ణ, జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణకు హాజరైనవారినుద్దేశించి మాట్లాడుతున్న డీవైఈవో వెంకటేశ్వరరావు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సర్పవరం జంక్షన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని భావించి ప్రజల కష్టంలో ఇంటికి పెద్ద కొడుకుగా సీఎం చంద్రబాబు నిలుస్తున్నారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 14 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.14,05,479 లక్షలను చెక్కుల రూపంలో వారి కుటుంబ సభ్యులకు గురువారం గొడారిగుంటలో ఆయన అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో వర్తించని వైద్యానికి ఖర్చులను సీఎం చంద్రబాబు ఉదార స్వభావంతో రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కరెడ్ల గోవిందు, శిరంగు శ్రీనివాసరావు, బండారు మురళి, పుల్ల శ్రీరాములు, పొంద్రంగి రాజు, ముద్దన ప్రకాశరావు, సోదె మునలయ్య, జీని శ్రీనివాస్, గోపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారునికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

ఎస్ఎంసీ కమిటీ సభ్యులకు శిక్షణ

సామర్లకోట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీ కమిటీలకు బాధ్యతలు తెలియ జెప్పేందుకు గురువారం సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో శిక్షణ తరగతులను ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా రిసోర్స్‌పర్సన్లు పి.శివ, కేవీ శ్రీనివాస్, కెఎస్.శేఖరం, పి.శ్రీకవిత వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. మండలంలోని ఐదు స్కూల్ కాంప్లెక్స్‌లకు చెందిన ఎస్ఎంసీ కమిటీల సభ్యులు, ప్రధానోపాధ్యాయులు యు.మీనామాధురి, తోటకూర సాయిరామకృష్ణ పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను ప్రతి ఒక్కరూ బాధ్యతతో నిర్వహించాలని రిసోర్స్‌పర్సన్ మురళీకృష్ణ కోరారు. తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఈవో మోకా ఉమ ఆధ్వర్యంలో పాఠశాల యాజమాన్య కమిటీలకు శిక్షణను ఎంపీపీ రాయుడు సునీత గురువారం ప్రారంభించారు. రిసోర్స్‌పర్సన్లు కె.వీరేంద్ర, కె.సత్యకళ్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సామర్లకోటలో శిక్షణ తరగతుల దృశ్యం

రంగవల్లుల పోటీలో ప్రతిభ

సామర్లకోట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎ సిటీ సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం పెద్దాపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ రంగవల్లుల పోటీలో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ప్రతిభ విద్యా సంస్థ ఎస్వీవీజీ ప్రకాష్, సంచాలకురాలు ఎస్వీవీ సుధారాణి తెలిపారు. ఇస్రో పీఎస్ ఎల్వీ మిషన్ సక్సెస్‌ఫుల్ అంశంపై సీహెచ్ దీపాంజలి బృందం రంగవల్లిక జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. కె.అవంతిక, సీహెచ్ విద్యాజ్యోతి బహుమతులు గెల్చుకున్నారు. గురువారం సాయంత్రం విజేతలను పాఠశాల ఆవరణలో అభినందించారు.



భవన నిర్మాణరంగ కార్మికులకు పథకాలు అమలుచేయాలి

పెద్దాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలుచేయాలని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ కోరారు. వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక కుటుంబాలు సంక్షేమ బోర్డు ద్వారా నుంచి రావాల్సిన క్లైముల కోసం ఎదురు చూస్తున్నాయన్నారు. ఈ నెల 27న ఎలక్ట్రీషియన్స్ డేను ఘనంగా నిర్వహించాలని కోరారు. ఉమామహేశ్వరరావు, రాంబాబు, జోగుబాబు, ఇబ్రహీం, రామ్మూర్తి, కుమార్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

సామర్లకోట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఉత్తర కేబిన్ గేట్ వద్ద సుమారు 50 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి గేటు దాటుతుండగా వేగంగా వెళ్తున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం వద్ద ఎటువంటి చిరునామా లభించలేదని సంఘటనాస్థలిని సందర్శించిన సామర్లకోట రైల్వే పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు గురువారం రాత్రి చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి):రాయభూపాల పట్నం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పెద్దాపురం ఈఈ ఏపీఎస్పీడీసీఎల్ ప్రభాకర్ తెలిపారు. సామర్లకోట మండలం జి.మేడపాడు, పెద్దాపురం మండలం రాయభూపాలపట్నం ఇండస్ట్రియల్ ఫీడర్, గోలివారి కొత్తూరు, పెదబ్రహ్మదేవం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

19,926 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు

పెద్దాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 19,926 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారని ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి తెలిపారు. పురుషులు 13,291 మంది, మహిళలు 6,633 మంది, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు ఉన్నారని, 31 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు.

రేషన్ షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల నిర్వహణకు అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తహసీల్దారు పి.త్రినాథరావు గురువారం తెలిపారు. మండలంలో 47 రేషన్ షాపులకు 18చోట్ల రాజీనామాలు, మరణించడం, 6(ఎ) కేసుల కారణంగా ఖాళీలు ఏర్పడ్డాయి. అభ్యర్థులు 18 నుంచి 40 ఏళ్లలోపు వయసు కలిగి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, పూర్తిచేసిన వాటిని ఈ నెల 8వ తేదీ సాయంత్రంలోపు తాళ్లరేవు తహసీల్దారు, కాకినాడ ఆర్డీవో కార్యాలయాల్లో అందివ్వాలన్నారు. 19న అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు. రోస్టరు, జనాభా ప్రతిపాదికన కేటగిరీ వైజుగా షాపులు కేటాయిస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దారు ఎం.సూరిబాబు, రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు అందే కాశీరాజు పాల్గొన్నారు.

ఆపద్బాంధవి అందుబాటులో లేకపోతే ఎలా!

కొత్తపల్లి మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం

కొత్తపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆపద సమయాల్లో క్షణాల్లో చేరుకుని ప్రాణాలను నిలబెట్టే 108 అంబులెన్స్ మండల కేంద్రమైన కొత్తపల్లిలో అందుబాటులో లేకపోవడంపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తపల్లి ఎంపీపీ కారేసుధ అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంపై ధ్వజమెత్తారు. ఇటీవల ఉప్పాడలో రెండేళ్ల చిన్నారిపై బీరువా పడి తీవ్ర గాయాలైనప్పుడు అత్యవసర కిత్సకై అంబులెన్స్ కోసం నిరీక్షించడంతో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని ఎంపీటీసీ బాదిన నాగేశ్వరరావు, దుళ్ల సత్తిబాబు, సర్పంచ్‌లు నక్కా మణికంఠ, ఉమ్మిడి మేరీజాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పాడలో నిర్వహిస్తున్న చేయూత మహిళామార్ట్‌లో కోట్ల రూపాయల అవినీతి జరిగిన విషయంలో నిజానిజాలను తక్షణం తెలియజేయాలని ఏపీఎం కె.తవుడును ప్రశ్నించారు. వాకతిప్పలో తాగునీరు మురుగువాసన వస్తోందని ఎంపీటీసీ దాకే నాగమహేశ్వరిరాజకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ పైప్‌లైనుకు ఏర్పడ్డ లీకుకు మరమ్మతు చేయిస్తామని ఏఈఈ రమణ చెప్పారు. అనంతరం 2025-26 సంవత్సరానికి రూ.53వేలు మిగులుతో రూపొందించిన అంచనా బడ్జెట్‌ను సూపరింటెం డెంట్ చలమయ్య ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. జడ్పీటీసీ గుబ్బల తులసికుమార్, వైస్ ఎంపీపీ సీహెచ్ సురేష్‌కుమార్, కో-ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, ఎంపీడీవో రవికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ రమణ

'మేనరిక వివాహాలను నివారించండి'

కొత్తపల్లి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మేనరిక వివాహాలను నివారించాలని, వాటి వల్ల జన్యుపరమైన వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని నాగులాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సౌజన్య పేర్కొన్నారు. మేనరిక పెళ్లిళ్లు-వాటి వల్ల వచ్చే అనర్థాలపై నాగులాపల్లి, ఇసుకపల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆమె మాట్లాడారు. మేనరిక పెళ్లిళ్లు చేసుకోవడం ద్వారా తలసేమియా, హీమోఫీలియా వంటి జన్యుపరమైన వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. మేనరిక వివాహాలు, వాటి దుష్ప్రభావాలపై డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో చైతన్యభారతి కళా సంఘ బృందం ప్రదర్శించిన బుర్ర కథ గ్రామస్తులను ఆలోచింపజేసింది. డాక్టర్ రిచ్వా, హెచ్ఎస్ అప్పారావు, హెచ్ఈ గౌరీశ్వరి, హెచ్‌వీ జ్యోతిప్రసన్న, హెల్త్ అసిస్టెంట్ కాకరపల్లి గంగాధరశ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చికెన్‌పాక్స్ వ్యాధి నివారక హోమియో మందులు పంపిణీ

పిఠాపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చికెన్‌పాక్స్ వ్యాధి నివారక హోమియో మందులను ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందజేశారు. రోజుకి నాలుగు వంతున మూడు రోజుల పాటు మాత్రలే వేస్తే విద్యార్థుల్లో రోగ నిరోధక శక్తి పెరిగి చికెన్‌పాక్స్ రాకుండా నివారించవచ్చని హోమియో వైద్యులు డాక్టర్ పింగళి ఆనందకుమార్, డాక్టర్ ఉమామహేశ్వరి, కృష్ణకుమార్ తెలిపారు. వ్యాధి సోకిన విద్యార్థులకు పట్టణ శివారులోని ఎంబీఎం హోమియో క్లినిక్‌లో ఉచితంగా చికిత్స అందజేస్తామని చెప్పారు. హెచ్ఎం రామకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా రమేష్

శంఖవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): శంఖవరం మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా బొండా రమేష్ నియమితు లయ్యారు. గురువారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో సభ్యులు ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రంగా లక్ష్మీనారాయణను, గౌరవాధ్యక్షుడిగా కుసుమంచి కృష్ణారావు ఎన్నిక య్యారు. ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రమేష్ చెప్పారు.

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


కాలెండర్ ఆ విష్కరిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్, డైరీని గురువారం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆ విష్కరించారు. కార్యక్రమంలో బోండ్ల వరప్రసాదరావు, లండా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సోడే దుర్గ, పాయం భవానీ, సోడే జయమ్మ, మడకం సుజాత పాల్గొన్నారు.

ఎటపాక: ఏటీపఏ క్యాలెండర్(2025)ను గురువారం ఎటపాక తహసీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈమేరకు క్యాలెండర్‌ను తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎంఈవో-2 సరియం రాజులు చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈసంద ర్భంగా తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎంఈ వో-2 సరియం రాజులు మాట్లాడారు. ఏజెన్సీలో ఏటీపఏ సంఘం ఆదివాసీలకు ఉద్యోగాలు, ఉపాధి, ఇతర హక్కుల కోసం నిరంతరం పోరా టాలు చేస్తుందన్నారు. ఆదివాసీ యువత చెడుఅలవాట్ల బాట పట్టకుండా, ఉజ్వల భవిషత్తు వైపు అడుగు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్ర మంలో ఏటీ ఏ రాష్ట్ర కార్యదర్శి పూనెం శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి కణితిరామకృష్ణ, మండల అధ్యక్షుడు కాకరాజు, ప్రధాన కార్యదర్శి కాక శివశంకర్, తులసి, గొంది లక్ష్మీ, శారద పాల్గొన్నారు.

ఏటీపఏ క్యాలెండర్ ఆవిష్కరణ

కూనవరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. స్థానిక ఎంఈవో లక్ష్మీనారాయణ చేతులమీదుగా ఈఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏటీపఏ నాయకులు అనిల్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల కోసం ఏటీపఏ అనేక పోరాటాలు చేసిందన్నారు. ముఖ్యంగా ఏజెన్సీలో గిరిజన ఉపాధ్యాయులకు ఎటువంటి సమస్యలు వచ్చినా ఏటీపఏ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో వీరయ్య, జితేంద్ర,


కూనవరంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో లక్ష్మీనారాయణ


ఎటపాకలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ , ఎంఈవో

ఘనంగా ప్రసన్న సాయిబాబా మందిరం 12వ వార్షికోత్సవం

మోతుగూడెం, జనవరి2 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలోని స ద్గురు ప్రసన్న సాయిబాబా మందిరం 12వ వార్షికోత్సవం రాజమ హేంద్రవరానికి చెందిన సోమిన శివప్రసాద్‌గురువు పర్యవేక్షణలో గురువారం ఘనంగా జరిగింది. ఉదయం ఐదు గంటలకు కాకడ హారతి, ఆరుగంటలకు దత్తాత్రేయస్వామి, భరద్వాజ మాస్టర్ వెంకయ్యస్వామి ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. తదుపరి బాబావారికి అలంకరణ చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన కిరణ్ సాయిబాబా సత్సంగం నిర్వహించారు. ఉదయం 9గంటలకు సామూహిక గురుపూజలు జరిపి మధ్యాహ్నం 12 గంటలకు హారతి ఇచ్చారు. చట్టుపక్కల గ్రామాల నుంచి వందలాదిగా భక్తులు వచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు మట్టపర్తి సత్యనారాయణ, ఇమ్మంది నర సింహమూర్తి, కొట్టు శ్రీనివాసరావు, పీటీ రామారావు, పప్పు విశ్వనాథం, చంద్రశేఖర్, భగవాన్, వెంకటేశ్వరరావు, ఆనంద్ పాల్గొన్నారు.


సాయిబాబాకు పాలాభిషేకం చేస్తున్న భక్తులు

క్రియ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అభినందన

రాజవొమ్మంగి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాకినాడ జేఎన్టీయూలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రియ పిల్లల పండుగలో రాజవొమ్మంగి హైస్కూల్ నుంచి సుమారు 60 మంది వివిధ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో కన్సులేషన్‌లో ద్వితీయ స్థానం గెలుపొందారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటుచేసి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం డీవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి పోటీల్లో పాల్గొనడంవలన విద్య, కళారంగంలో పోటీతత్వం అలవడుతుందన్నారు. ఈ పోటీలకు తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయులు మిరియాల కొండబాబు, చింతోజి శివకృష్ణ, వి.రాజమ్మ, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మరిచర్ల శ్రీనివాస్ వైస్ చైర్మన్ చీడి వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

ప్రతిఒక్కరూ క్రీడాపోటీల్లో పాల్గొనాలి

• క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు స్థానిక డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి ఎస్‌ఐలు రఘునందనరావు, శివనాగబాబు, సతీష్ నేతృత్వంలో గ్రామీణ సాంప్రదాయ క్రీడాపోటీలు గురువారం మొదలయ్యాయి. ముఖ్య అతిథులుగా హాజరైన జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు పోటీలను ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే జ్యోతిప్రజ్వలన చేసి శాంతి కపోతాలను గాలిలోకి ఎగురవేశారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఆరు రోజులపాటు నిర్వహించే ఈ పోటీల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ హెల్మెట్, సీట్‌బెల్ట్ పెట్టుకుని, రాంగ్ రూట్లో డ్రైవింగ్ చేయకుండా ప్రాణాలను కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, ఎంపీపీ తోట రవి, అత్తులూరి నాగబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, పోతుల మోహన్‌రావు, కందుల చిట్టిబాబు, చదరం చంటిబాబు, జీను మణిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, సీడీపీవో పూర్ణిమ, సర్పంచ్‌లు అడబాల రామాంజనేయులు, బూసాల విష్ణు, నియోజకవర్గ ప్రముఖులు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయండి'

కోటనందూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేసేందుకు విద్యా కమిటీ చైర్మన్‌లు కృషి చేయాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. కోటనందూరు హైస్కూల్‌లో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి కృషిచేస్తోందన్నారు. అందుకు అనుగుణంగా చైర్మన్‌లు కృషిచేయాలన్నారు. సమావేశంలో 32మంది చైర్మన్‌లు పాల్గొన్నారు. ఎంఈవో శేఖర్, సీఆర్పీలు యర్రశేఖర్, రిసోర్సుపర్సన్‌లు అచ్చియ్యానాయుడు, నాగేశ్వరరావు, చింతకాయల రాజుబాబు, ఎంఏ సత్యనారాయణ, కుసిరెడ్డి శ్రీను, చందకశ్రీను పాల్గొన్నారు.

విజేతలకు అభినందన

కిర్లంపూడి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెల 28, 29 తేదీల్లో కాకినాడ జేఎన్టీయూకేలో జరిగిన రాష్ట్రస్థాయి క్రియ పోటీల్లో లఘునాటిక విభాగంలో కిర్లంపూడి మండలం తామరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో విద్యార్థులు ద్వితీయ స్థానం, తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా గురువారం ఆ విద్యార్థులను హెచ్‌ఎం ఎల్.కృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో సివిక్స్ అధ్యాపకుడు బావిశెట్టి లక్ష్మీనారాయణ, వైస్ చైర్‌పర్సన్ పేరూరి రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసులపై దూసుకెళ్లిన గంజాయి స్మగ్లర్ కారు

కిర్లంపూడి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): కృష్ణవరం గ్రామం టోల్‌ప్లాజా వద్ద డిసెంబరు 31న అర్ధరాత్రి పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తుండగా ఓ కారు ఆపుతున్నట్టు ఆపి ఒక్కసారిగా పోలీసులపై దూసుకెళ్లిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్‌ఐ సతీష్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు జరిగాయి. అర్ధరాత్రి సమయంలో విశాఖ నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారును ఆపగా రోడ్డు పక్కకి తీస్తున్నట్టుగా నటించి డ్రైవర్ ఒక్కసారిగా వాహనాన్ని ముందుకు పోనిచ్చాడు. దీంతో కారు ముందు ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లను ఢీకొట్టి వెళ్లింది. ఒక కానిస్టేబుల్‌ను ఆసుపత్రిలో చేర్పగా, మరో కానిస్టేబుల్‌కు స్వల్ప గాలయ్యాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ కారును రాజానగరం సమీపంలో కెనాల్ రోడ్డులో వదిలి డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు బృందాలుగా ఏర్పడి వెంటాడడంతో అవడంతో అక్కడి నుంచి తప్పించుకున్నారు. పోలీసు దర్యాప్తు జరుగుతోంది.

కానిస్టేబుళ్లను ఢీకొన్న కారు ఘటనలో నిందితులు అరెస్టు?

కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద ఢీకొట్టి పరారైన కారు ఆచూకీ లభించినట్టు సమాచారం. అయితే కారులో ఉన్నవారిని కూడా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. పరారైన కారులో ఏముందో తెలియదుకాని విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచుతున్నారు. దీనిపై పోలీసులను వివరణ అడగ్గా విచారణ కొనసాగుతుందని పోలీసులు తెలియజేశారు.

యర్రవరం కర్మాగారంలో మహిళ అనుమానాస్పద మృతి



యర్రవరం అవంతి కర్మాగారం వద్ద మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు.. (ఇన్‌సెట్‌లో) జామి మహాలక్ష్మి

ఏలేశ్వరం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం మండలంలోని యర్రవరం అవంతి ప్రాజెక్ట్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో అనుమానాస్పదంగా జామి మహాలక్ష్మి (33) అనే మహిళ గురువారం మృతి చెందింది. డిసెంబర్ 31న ఆమె కర్మాగారంలో అనుమానాస్పదంగా కిందపడి ఉండడంతో స్థానికంగా ఉన్న కార్మికులు చూసి బంధువులకు సమాచారం ఇచ్చారు. అవంతి పరిశ్రమకు సంబంధించిన జగ్గంపేట, రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. రెండురోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఆమె మృతి చెందింది. దీంతో బంధువులు మృతదేహంతో పరిశ్రమగేటు వద్ద ఆందోళనకు దిగారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఏం జరిగిందో పూర్తి విచారణ చేపట్టాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భర్త అనారోగ్యం కారణంగా కుటుంబ పోషణ కోసం రెండున్నరేళ్లుగా ఆమె కర్మాగారంలో కార్మికురాలిగా పనిచేస్తూ తమ ఇద్దరు కుమార్తెలతో జీవనం సాగిస్తున్నారు.

శ్మశాన వాటికలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కిర్లంపూడి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగపతినగరంలో శ్మశాన వాటికలో అభివృద్ధి పనులకు ఎంపీపీ తోట రవి, టీడీపీ నాయకులు గురువారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ, టీడీపీ నాయకులు మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా శ్మశాన వాటికలో కాష్టాలు నిర్మించి శాశ్వత భవనాన్ని నిర్మించడానికి మండల పరిషత్ నిధులతో నిర్మించామన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, తూము కుమార్, కుర్ల చినబాబు, ఆళ్ల నానాజీ, కాళ్ల వెంకటేష్, మద్దాల మణికంఠ స్వామి, ఆళ్ల బాబులు, సరిసే శివ, కోడెల నల్లబ్బాయి, మొల్లేటి కన్నబాబు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కిర్లంపూడి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లంగిలో శ్రీ భూ సమేత శ్రీ వేంకటస్వామి ఆలయంలో గురువారం స్వామి వారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం పూజ సందర్భంగా స్వామి వారి నిజ రూప దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరంలో ప్రతినెలలో జరిగే స్వామి వారి ముఖ్య కార్యక్రమాలతో కూడిన క్యాలెండర్‌ను బాబా మహదేవ్ మహోజ్వల ఆశ్రమం, శ్రీ స్వామి రామానంద రమణ సేవాశ్రమం వారు ఆవిష్కరించారు.

ధర్మవరంలో హైందవ ర్యాలీ

ప్రత్తిపాడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో గురువారం హైందవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు రాజగోపాలస్వామి గుడి వద్ద నుంచి ఈ ర్యాలీని ప్రారంభించి మెయిన్ రోడ్డు, సీతంపేట, రామారావుపేట, మంగయమ్మపేట, నందిసెంటర్, గూడుపు, పల్లపు వీధుల మీదుగా సినిమా సెంటర్ వరకు నిర్వహించారు.ఈ నెల 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దొడ్డిపట్ల సోమన్న దొర, సానా నూకరాజు నాయుడు, చుక్కల సత్యానారాయణ, నక్క శ్రీను, జామ్ సూర్యనారాయణ, రామకుర్తిరాజబాబు, ఏడుకొండలు, సిద్దపు రెడ్డి నాగరాజు, గొర్ల శ్రీనివాస్ ఉప్పల తిరుపతిరావు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం


ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చిత్రపటానికి గురువారం ప్రత్తిపాడులో పాలాభిషేకం నిర్వహించారు. మండలంలోని పెద్దిపాలెం, వేములపాలెం, గోకవరం, ఉత్తరకంచి, టి.రాయవరం గ్రామాల రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులు చేపడతున్నందుకు ఎమ్మెల్యే సత్యప్రభకు కృతజ్ఞత పూర్వకంగా ఆయా గ్రామాల ప్రజలు ప్రత్తిపాడు తరలివచ్చి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దశాబ్దకాలంగా తమ గ్రామాల రహదారులను నిర్లక్ష్యంగా వదిలివేశారని, కూటమి ప్రభుత్వం ఆరునెలల్లోనే తమ గ్రామాల శిథిల రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం సంతోషదాయకమని, దీనికి కృషిచేసిన ఎమ్మెల్యే సత్యప్రభ రాజాకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రత్తిపాడు ఆసుపత్రి అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదనలు

• జిల్లా ఆసుపత్రుల కో ఆర్డినేటర్ డాక్టర్ స్వప్న


ఎమ్మెల్యే సత్యప్రభకు బొకే అందజేస్తున్న ఆస్పత్రుల కోఆర్డినేటర్ డాక్టర్ స్వప్న

ప్రత్తిపాడు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రి 50 పడకలస్థాయి నుంచి 100 పడకల స్థాయికి పెంపుదలకు ప్రతిపాదనలుఉన్నాయని జిల్లా వైద్య విధాన పరిషత్ ఏరియా కో ఆర్డినేటర్ డాక్టర్ సంపత్ స్వప్న చెప్పారు. స్థానిక ఆసుపత్రిలో గురువారం డాక్టర్ స్వప్న విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 9 సీహెచ్‌సీలు, ఒక ఏరియా ఆసుపత్రి పని చేస్తున్నాయని తెలిపారు. వీటిలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, పెద్దాపురం సీహెచ్‌లు 50 పడకల ఆసుపత్రులుగా కొనసాగుతున్నాయన్నారు. ప్రత్తిపాడులో రూ.10కోట్లతో 50 పడకల కొత్త బ్లాక్ ఆసుపత్రి నిర్మాణ పనులు ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తిచేస్తామన్నారు.ఏరియా ఆసుపత్రిల్లో ఆరోగ్యశ్రీ పథకం మంజూరు అవకాశం ఉన్నట్లు స్వప్న తెలిపారు.ప్రత్తిపాడు ఆసుపత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని త్వరలో భర్తీ చేస్తామని స్వప్న తెలిపారు. జిల్లాలోని ఏరియా ఆసుపత్రిలో ఎటువంటి మందుల కొరత లేదన్నారు. ఏరియా ఆస్పత్రుల్లో డెలివరీ సేవలు అధికంగా వినియోగించుకుంటున్నారని స్వప్న తెలిపారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటిండెంట్ సౌమ్య మైకేల్ ఉన్నారు.

జైపాల్ సింగ్ ముండా జయంతి వేడుకలకు ఆదివాసీలు తరలిరావాలి

దేవీపట్నం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరులో శుక్రవారం నిర్వహించే జైపాల్ సింగ్ ముండా 122వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ తెలిపారు. యలగాడ నాగేశ్వరరావు ఇంటి వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, ఆదివాసీలు, నూతనంగా ఎన్నికైన పీసా గ్రామసభ ఉ పాధ్యక్షులు, కార్యదర్శులు హాజరుకావాలన్నారు. ఆది వాసీ సభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు.

యువత సన్మార్గంలో ముందుకు సాగాలి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు

తుని రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): యువత సన్మార్గంలో ముందుకు సాగాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టంచేశారు. తేటగుంట టీడీపీ కార్యాలయం వద్ద మండల గ్రామాలకు చెందిన పలువురు యువకులు జీవన ఉపాధికి పలు వాహనాలు కొనుగోలుచేయగా వాటిని యనమల రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలని యువతను ప్రోత్సహించేందకు కూటమి ప్రభుత్వం అనేక పథకాలు రూపకల్పనకు కృషి చేస్తోందని చెప్పారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల

కార్యకర్తలకు యనమల అభినందనలు

తుని రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తేటగుంట టీడీపీ కార్యాలయంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అధ్యక్షతన కార్యకర్తలకు అభినందన సభ నిర్వహించారు. న్యూఇయర్ వేడుకల్లో సేవలు అందించిన నియోజకవర్గానికి చెందిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలతోపాటు శానిటేషన్ సేవలు అందించిన మున్సిపాల్టీ, పోలీసులు, పంచాయతీ సిబ్బంది హాజరయ్యారు. ఇంకా ఈ కార్యక్రమంలో తుని పట్టణ, రూరల్ సీఐలు, టీడీపీ నాయకులు యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, యినిగంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్పౌజ్ కేటగిరీ పింఛన్ల పంపిణీ

జగ్గంపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్యాంపు కార్యాలయంలో స్పౌజ్ కేటగిరీలో కోరుమిల్లి రాజేశ్వరి, కింతాడ పార్వతి, ముగ్గ ముత్యాలమ్మ, దురుపూడి రత్నంలకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురువారం పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, జీను మణిబాబు, బీజేపీ జగ్గంపేట ఇన్‌చార్జి దాట్ల కృష్ణవర్మ, బచ్చల సుధీర్, పంచాయతీ కార్యదర్శి రాజన్‌రాజు, సత్యంరాజా, పంచాయతీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం

తుని పట్నం పలు వార్డుల్లో శానిటేషన్ సమస్యలు పరిష్కరించాలని జనసేన పార్టీ నాయకులు కమిషనర్ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా 28వ వార్డు ఉప్పరగూడెంకు వెళ్లేదారిలో ఉన్న డంపింగ్ యార్డు వల్ల అక్కడ ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు చూపాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. వినతి పత్రం అందించిన వారిలో అద్దేపల్లి బాలాజీ, సీతారామరాజు, శ్రీనివాస్‌తో పాటు జనసేన కార్యకర్తలు ఉన్నారు.

తహశీల్దార్ కార్యాలయ మార్పునకు కలెక్టర్ ఆదేశాలు

ప్రత్తిపాడు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది వేరే కార్యాలయ భవనంలో విధులు నిర్వహించే విధంగా తరలివెళ్లేందుకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ షగిలి చర్యలు తీసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ పరిశీలించారు. కార్యాలయం మొత్తం శ్లాబ్ బీటలు వేయడం, రికార్డు రూం, సమావేశహాలు, తహశీల్దార్, సిబ్బంది గదులు అధ్వానంగా ఉండడంతో వెంటనే సిబ్బంది వేరే భవనంలో విధులు నిర్వహించే విధంగా పదిరోజుల్లో ఏర్పాట్లు చేసుకోవాలని తహశీల్దార్ సూర్యప్రభను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో కుమార్‌బాబు, ఈఈ రత్నంరాజు, తదితరులు ఉన్నారు.